kamareddy teaser:

కామారెడ్డి మున్సిపాలిటీ కాంగ్రెస్‌దే.. 3





'మార్పు తేకపోతే మళ్లీ పోటీ చేయను' 2

AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
www.aksharatoday.in

9-2-2026 | NIZAMABAD / KAMAREDDY | PAGES - 3

## మున్సిపల్ ఎన్నికలు..11న సెలవు

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా ఈనెల 11న పోలింగ్ జరగనుంది. ఈ నేపథ్యంలో జిల్లాలో విద్యా, వ్యాపార సంస్థలకు సెలవు ప్రకటిస్తున్నట్లు కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. ఈ మేరకు సోమవారం ప్రకటన విడుదల చేశారు. ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటుహక్కును వినియోగించుకునేందుకు వీలుగా జిల్లాలో 11న సెలవు ప్రకటించినట్లు కలెక్టర్ తెలిపారు. నిజామాబాద్, బోధన్, ఆర్మూర్, భీమ్‌గల్ మున్సిపాలిటీల పరిధిలో ఈనెల 11న బుధవారం అన్నిరకాల సంస్థలు, దుకాణాలకు సెలవు ప్రకటించామన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ రంగ సంస్థలు, వ్యాపార సంస్థలలో పనిచేస్తున్న ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకునేలా వేతనంతో కూడిన సెలవు మంజూరు చేయాలని సంబంధిత యాజమాన్యాలకు ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించారు.



## పోలింగ్, కౌంటింగ్‌కు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా చూడాలి

**అక్షరటుడే, ఆర్మూర్ :** మున్సిపల్ ఎన్నికల సందర్భంగా పోలింగ్, కౌంటింగ్‌కు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా చూడాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను ఆమె సోమవారం సందర్శించారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో అందుబాటులో ఉన్న సదుపాయాలను పరిశీలించి, తాగునీటి వసతి, వైద్య శిబిరం, అల్పాహారం, భోజన వసతి, షామియానాలు ఇతర అన్ని వసతులు ఏర్పాటు చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఎలాంటి లోటుపాట్లు, గందరగోళానికి తావులేకుండా సిబ్బందికి పోలింగ్ సామగ్రిని పక్కాగా అందించాలని, చెక్‌లిస్టు ఆధారంగా ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామగ్రి అందినదా, లేదా అన్నది జాగ్రత్తగా పరిశీలించుకోవాలని సూచించారు. సకాలంలో నిర్దేశిత పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది చేరుకునేలా పర్యవేక్షణ జరపాలని అధికారులను ఆదేశించారు. పోలింగ్ సామాగ్రి, ప్రత్యేకించి బ్యాలెట్ పేపర్లు తరలించే సమయంలో తప్పనిసరిగా సాయుధ పోలీసులతో కూడిన బందోబస్తు ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా వెంటనే తమ దృష్టికి తేవాలని సూచించారు. స్ట్రాంగ్ రూం, కౌంటింగ్ హాళ్లను సైతం పరిశీలించిన కలెక్టర్, సీసీటీవీలు ఏర్పాటు చేయాలని, ఒక్క సెకను కూడా విద్యుత్ అంతరాయం ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కలెక్టర్ వెంట ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియా, ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర రెడ్డి, స్థానిక అధికారులు ఉన్నారు.




## గల్లీగల్లీలో రోడ్లు వేసింది బీఆర్ఎస్ ప్రభుత్వమే..: బిగాల గణేశ్ గుప్తా

**అక్షరటుడే, ఇందూరు :** నగరంలోని ప్రతిగల్లీలో రోడ్లు వేసింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా అన్నారు. జిల్లా కేంద్రంలోని హమాల్‌వాడి చౌరస్తాలో 35వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థి తాటికొండ నరేష్‌కు మద్దతుగా కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా బిగాల గణేష్ గుప్తా మాట్లాడుతూ బీజేపీ నాయకులు ఆలయాల నిర్మాణానికి చందాలు వసూలు చేస్తే బీఆర్ఎస్ ప్రభుత్వం ఏకంగా ఎన్నో ఆలయాలనే నిర్మించిందని అన్నారు. ధన్‌పాల్ సూర్యనారాయణ బీజేపీ ఎమ్మెల్యేగా గెలిచిన అనంతరం ప్రభుత్వం నిధులు ఇవ్వకపోతే తన సొంత ట్రస్ట్ నుంచి అభివృద్ధి చేస్తానని మాట ఇచ్చారని.. ఆ మాట నిలబెట్టుకున్నారా అని ప్రశ్నించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఆడబిడ్డలకు స్కూటీలు కొనిస్తానని సీఎం రేవంత్ రెడ్డి మాటిచ్చారని ఇప్పటివరకు ఆ మాట నిలబెట్టుకోలేదన్నారు. కల్యాణ లక్ష్మిలో భాగంగా తులం బంగారం ఇస్తానని కూడా హామీ ఇచ్చి మరిచారన్నారు. నగరాన్ని సుందరంగా మార్చింది బీఆర్ఎస్ ప్రభుత్వమని.. రాత్రి వేళల్లో నగరం వెలిగిపోయేలా చేసింది బీఆర్ఎస్ అని ఆయన గుర్తు చేశారు. అలాంటి బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపిస్తే కాలనీల్లో మీ వెంటే ఉంటూ అభివృద్ధికి పాటు పడతారని ఆయన పేర్కొన్నారు.



**మున్సిపల్ ఎన్నికల్లో ప్రచార పర్వం ముగిసింది. ఇక ఎన్నికలకు సమయం ఆసన్నమైంది. అన్ని వార్డులలో అభ్యర్థులు తమ ప్రచారాన్ని హోరెత్తించారు. ప్రధాన పార్టీల నుంచి ముఖ్య నేతలు రంగంలోకి దిగి ప్రచార పర్వంలో పాల్గొన్నారు. ఒక్కో వార్డులో రెండు, మూడు సార్లు ముఖ్య నాయకులు ప్రచారం చేపట్టారు. సోమవారం సాయంత్రం 5 గంటలకు ప్రచార సమయం ముగియడంతో అభ్యర్థులు ప్రలోభాలకు తెర తీశారు. ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి యత్నిస్తున్నారు. ఇంటింటకి తాయిలాలు అందించే ఏర్పాట్లు చేస్తున్నారు.**

**- అక్షరటుడే, కామారెడ్డి**

# ప్రచారానికి తెర

- మున్సిపల్ ఎన్నికల్లో మూగబోయిన మైక్‌లు
- గెలుపు కోసం అభ్యర్థుల పాట్లు
- తెర వెనుక వ్యూహాలు
- భారీగా ఖర్చు చేయడానికి వెనుకాడని వైనం

ఉమ్మడి జిల్లాలో నిజామాబాద్ కార్పొరేషన్ సహా ఏడు మున్సిపాలిటీల్లో ఈ నెల 11న ఎన్నికలు జరగనున్నాయి. మొత్తం 60 డివిజన్లు, 184 వార్డుల్లో ఎన్నికలు నిర్వహించడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. నిజామాబాద్ కార్పొరేషన్, కామారెడ్డి బల్దియా పీఠాలను కైవసం చేసుకోవాలని ప్రధాన పార్టీలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. ఈ రెండు చోట్ల రాజకీయాలు రసవత్తరంగా మారుతున్నాయి.

### ఓటర్ల వివరాలు సేకరణ

ఉమ్మడి జిల్లాలో అభ్యర్థులు ఇప్పటికే ఓటర్ల పూర్తి వివరాలు సేకరించారు. ఓటరు ఉంటున్న అడ్రస్, వారి ఫోన్ నంబర్, తదితర వివరాలన్నీ కౌన్సిలర్ అభ్యర్థులు సేకరించి తమవద్ద ఉంచుకున్నారు. దూరప్రాంతాల్లో ఉన్న ఓటర్లకు ఇప్పటికే ఫోన్ ద్వారా మాట్లాడి ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ నెల 11న పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు వేసి వెళ్లాలని అవసరం అయితే దారి ఖర్చులు కూడా ఇస్తామని వాగ్దానాలు కూడా చేశారు.

### ఓటుకు రూ.5 వేల నుంచి రూ.10 వేలు

నిజామాబాద్ కార్పొరేషన్, కామారెడ్డి మున్సిపాలిటీలను ప్రధాన పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. మిగతా మున్సిపాలిటీల్లో సైతం గెలుపే లక్ష్యంగా అభ్యర్థులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ముఖ్యంగా మేయర్, ఛైర్ పర్సన్ రేసులో ఉన్న నాయకులు భారీగా ఖర్చు చేయడానికి సిద్ధం అవుతున్నారు. ముఖ్యమైన వార్డుల్లో ఓటుకు రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు పంపిణీ చేయనున్నట్లు సమాచారం. ఎన్నికల్లో ఎలాగైనా గెలవాల్సిందేనని అభ్యర్థులు ముందుకు వెళ్తున్నారు. ఎన్నికల కోసం భూములు సైతం అమ్ముకోవడానికి వెనకాడడం లేదు.

### నోట్ల పంపిణీకి రంగం సిద్ధం

ఉమ్మడి జిల్లాలోని మున్సిపాలిటీలలో 60 డివిజన్లు, 184 వార్డులలో కొన్ని వార్డులు ప్రధానమైనవిగా ఉన్నాయి. ఇందులో పోటీ కూడా తీవ్రంగానే ఉంది. దాంతో అభ్యర్థులు ఒకటికి పదిసార్లు ఓటర్ల చుట్టూ తిరుగుతూ మచ్చిక చేసుకుంటున్నారు. అయినా అభ్యర్థుల నుంచి ఓటర్లు ఏదో ఆశిస్తారని భావించి డబ్బుల పంపిణీకి శ్రీకారం చుట్టడానికి రెడీ అయ్యారు. ఇప్పటికే వార్డులో ఎంతమేరకు నగదు కావాలో సేకరించి సిద్ధంగా ఉంచుకున్నట్లుగా తెలుస్తోంది. ప్రచారం ముగియడంతో ఇంటింటికి నగదు పంపిణీకి రంగం సిద్ధం చేసుకున్నారు.

## కాంగ్రెస్‌కు ఓటమి భయం..: రాంచందర్‌రావు

**అక్షరటుడే, ఇందూరు :** మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటమి భయం పట్టుకుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు అన్నారు. సోమవారం ఆయన నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. నిజామాబాద్ కార్పొరేషన్‌ను బీజేపీ గెలుచుకుంటుందని రాంచందర్‌రావు ధీమా వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి బీజేపీపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర నిధులతో రాష్ట్రం అభివృద్ధిలో దూసుకు పోతుందన్నారు. అన్ని రాష్ట్రాలకు కేంద్రం నిధులు విడుదల చేస్తోందన్నారు. కాంగ్రెస్ మాత్రం ఉతర, దక్షిణ భారత్ పేరిట ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొట్టేందుకు యత్నిస్తోందన్నారు. కేంద్రం అమృత్ పథకం కింద నిజామాబాద్ రైల్వే స్టేషన్ అభివృద్ధికి నిధులు మంజూరు చేసిందన్నారు.

### కాంగ్రెస్ ఏం చేసింది..

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్లు దాటిపోతుందని బీజేపీ అధ్యక్షుడు అన్నారు. ఈ రెండేళ్లలో ఏం చేశారో కాంగ్రెస్ నాయకులు చెప్పాలని ప్రశ్నించారు.




ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ పాలనలో శాంతిభద్రతలు అదుపు తప్పాయన్నారు. పట్ట పగలు హత్యలు జరుగుతున్నాయని సంచలన వ్యాఖ్యలు చేశారు. కార్యక్రమంలో ఎంపీ ధర్మపురి అర్వింద్, ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులచారి, పసుపు బోర్డు ఛైర్మన్ పల్లె గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ కళాశాల బాలుర హాస్టల్ వార్డెన్ సస్పెన్షన్

**అక్షర టుడే, ఇందూరు:** జిల్లా కేంద్రంలోని నాందేవ్ వాడలో గల ఎస్సీ కళాశాల బాలుర హాస్టల్ (బి) వార్డెన్ ఎం.జీవన్ ను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఇలా త్రిపాఠి ఉత్తర్వులు జారీ చేశారు. సంక్షేమ వసతి గృహంలో విద్యార్థుల కోసం కేటాయించిన సన్న బియ్యంను సదరు వార్డెన్ అక్రమంగా తరలిస్తున్నారని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఇంచార్జి అధికారి రాజగంగారాం సమర్పించిన నివేదిక ఆధారంగా చర్యలు తీసుకున్నారు. సన్న బియ్యం అక్రమ తరలింపు విషయమై సమగ్ర విచారణ జరపాలని డీ.ఎస్.సీ.డీ.ఓను ఆదేశించారు. విచారణ పూర్తయ్యే వరకు హాస్టల్ వార్డెన్ జీవన్ కార్యస్థానం వదిలి వెళ్లకూడదని సస్పెన్షన్ ఉత్తర్వులలో కలెక్టర్ పేర్కొన్నారు.

## 18 గుర్తింపు కార్డుల్లో ఏదైనా చూపవచ్చు..

**అక్షరటుడే, ఇందూరు:** మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు 18 రకాల గుర్తింపు కార్డులలో ఏదైనా తమ వెంట తీసుకెళ్లాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. ఓటర్ కార్డు, ఆధార్ కార్డు, ఉపాధి హామీ జాబ్ కార్డు, ఫోటోతో కూడిన పోస్ట్ ఆఫీస్, బ్యాంక్ పాస్ బుక్, కార్మిక మంత్రిత్వ శాఖ ద్వారా జారీ చేసిన హెల్త్ ఇన్సూరెన్స్ కార్డు తీసుకెళ్లవచ్చన్నారు. అలాగే స్మార్ట్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాన్‌కార్డ్, లేబర్ గుర్తింపు కార్డు, ఇండియన్ పాస్‌పోర్ట్, ఫొటోతో కూడిన పెన్షన్ డాక్యుమెంట్, కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వంచే జారీ చేయబడిన ఉద్యోగ గుర్తింపు కార్డు, ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు ఇచ్చిన అధికారిక గుర్తింపు కార్డు, దివ్యాంగుల గుర్తింపు కార్డులో ఏదైనా పోలింగ్ కేంద్రానికి తీసుకెళ్లవచ్చన్నారు.

## పోస్టాఫీస్‌లలో ఆధార్ సేవలు

**అక్షరటుడే, ఇందూరు :** ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో కొన్ని గుర్తించబడిన పోస్టాఫీస్‌లలో ఆధార్ సేవలు అందిస్తున్నామని తపాలాశాఖ సీనియర్ సూపరింటెండెంట్ జనార్ధన్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవార ఓ ప్రకటన విడుదల చేశారు.ఉమ్మడిజిల్లాలో ఎంపిక చేసిన పోస్ట్ ఆఫీసుల్లో ఆధార్ నమోదు, మార్పులు, చేర్పులు చేయబడతాయని ఆయన పేర్కొన్నారు. ఇప్పటివరకు ఆధార్ నమోదు చేసుకోని వారు, ఆధార్‌లోని పేరు, పుట్టిన తేదీ, చిరునామా, మొబైల్ నంబర్, ఫొటో, బయోమెట్రిక్స్ వంటి వివరాలలో మార్పులు అవసరమైన వారు పోస్టాఫీస్ పనిదినాల్లో సంప్రదించవచ్చన్నారు. ఆర్మూర్, నిజామాబాద్ , కామారెడ్డి హెడ్ పోస్ట్ ఆఫీసులు, వేల్పూర్, నిజామాబాద్ ఆర్ఎస్, సుభాష్ నగర్, బాన్సువాడ, బోధన్, మద్నూర్, శక్కర్ నగర్, డిచ్‌పల్లి, నవీపేట్ సబ్ పోస్టాఫీస్‌లలో ఈ సౌకర్యం అందుబాటులో ఉందని జనార్ధన్ రెడ్డి తెలిపారు. ప్రజలు ఆధార్‌లో మార్పులు చేర్పులు, కొత్త ఆధార్ కోసం నిబంధలన ప్రకారం ఆధారాలు చూపించాల్సి ఉంటుందన్నారు.

## ప్రశాంతంగా ఓటు వేసేలా చర్యలు తీసుకోవాలి

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ :** మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు ప్రశాంతంగా ఓటు హక్కును వినియోగించుకునే విధంగా పోలీస్ శాఖ చర్యలు తీసుకోవాలని సీపీ సాయిచైతన్య అన్నారు. ఈ మేరకు నగరంలోని సీపీ కార్యాలయంలో ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. నిజామాబాద్ డివిజన్ పరిధిలో సమస్యాత్మకమైన, అతి సమస్యాత్మకమైన పోలింగ్ కేంద్రాలను ముందే గుర్తించామని సీపీ సాయిచైతన్య అన్నారు. ఆ ప్రాంతంలో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఆయా ప్రాంతాల్లో పటిష్టమైన భద్రత ఏర్పాటు చేశామన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి నిర్దిష్ట దూరంలో మార్కింగ్ చేయించి ప్రచారం, గుర్తులను ప్రదర్శించకుండా నిరోధించాలని సూచించారు.

### చెక్‌పోస్టుల్లో పటిష్టమైన భద్రత..

ఎన్నికలను ప్రభావితం చేసే డబ్బు, మద్యాన్ని నిరోధించేకు అంతర్రాష్ట, అంతర్‌జిల్లా చెక్‌పోస్టులను ఇప్పటికే ఏర్పాటు చేశామని వాటివద్ద నిఘాను కట్టుదిట్టం చేశామని సీపీ తెలిపారు. పోలీసు



అధికారులు ఆయా ప్రదేశాలపై నిరంతం పర్యవేక్షణ చేయాలని సూచించారు. ఎన్నికల రోజు సిబ్బంది తెల్లవారుజామునే తమకు కేటాయించిన పోలింగ్ బూత్‌లో హాజరు కావాలని..అలాగే పోలింగ్ బాక్స్‌లను సెంటర్‌కు తీసుకొచ్చేవరకు పటిష్టమైన భద్రత ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే ఓట్ల లెక్కింపు ముగిసేవరకు పోలీసు సిబ్బంది ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా విధులు నిర్వహించాలన్నారు. నిబంధనలు పాటించని అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమీక్షలో పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## నిర్భయంగా ఓటుహక్కు వినియోగించుకోవాలి

**అక్షరటుడే, కామారెడ్డి:** మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎస్పీ రాజేష్ చంద్ర అన్నారు. కామారెడ్డి పట్టణంలో సోమవారం శిశుమందిర్ స్కూల్ నుంచి న్యూ బస్టాండ్, నిజాంసాగర్ రోడ్, బడా మసీద్, పాంచ్ చౌరస్తా, డెయిలీ మార్కెట్, బాంబే క్లాత్ స్టోర్, రైల్వే స్టేషన్, సిరిసిల్ల రోడ్డు మీదుగా రాజీవ్ పార్క్ వరకు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఎన్నికల వేళ ప్రజల్లో మరింత భద్రతాభావం పెంపొందించడం, నమ్మకాన్ని కలిగించడం, పోలీస్ శాఖ పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉందనే సందేశాన్ని ఇవ్వడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు ఎస్పీ తెలిపారు. ఎన్నికలు పూర్తిగా నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించబడతాయని, ప్రజలు పోలీసు శాఖకు పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. ఎన్నికల నిర్వహణలో ప్రజల భాగస్వామ్యం, పోలీసులకు అందించే సహకారం అత్యంత కీలకమని తెలిపారు.

### గడువు ముగిసిన అనంతరం..

ప్రచార గడువు ముగిసిన తర్వాత అభ్యర్థులు, మద్దతుదారులు ఎవరైనా ప్రచారం నిర్వహిస్తే కఠినచర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. సమస్యాత్మక పోలింగ్



కేంద్రాలు, కీలక ప్రాంతాలు నిరంతరం సీసీ కెమెరాల నిఘాలో ఉంటాయని, ప్రతి కదలికను కంట్రోల్ రూమ్ నుంచి పర్యవేక్షిస్తామని పేర్కొన్నారు. అవాంఛనీయ ఘటన జరగకుండా ముందస్తుగా అన్ని భద్రతా ఏర్పాట్లు పూర్తి చేశామని వెల్లడించారు. ఓటర్లు మద్యం, డబ్బు, బహుమతులు వంటి ఎలాంటి ప్రలోభాలకు గురికావద్దన్నారు. అటువంటి సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు, అసత్య ప్రచారాలు చేయవద్దని, శాంతియుత ఎన్నికల నిర్వహణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా మెలగాలని విజ్ఞప్తి చేశారు.

## ప్రజలు స్వేచ్ఛాయుతంగా ఓటు హక్కును వినియోగించుకోవాలి



**అక్షరటుడే, ఎల్లారెడ్డి :** మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని డీఎస్పీ శ్రీనివాస్, ఆర్డీవో పార్థ సింహారెడ్డి అన్నారు. పోలీస్ బలగాలతో కలిసి ఎల్లారెడ్డి పట్టణంలో సోమవారం వార్డుల్లో, గండిమసానిపేట లింగారెడ్డి పేట్, శివారు గ్రామాల్లో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. శాంతియుతంగా ఎన్నికలు జరిగేలా, ప్రజలు తమ ఓటుహక్కు వినియోగించుకునేలా వారిలో నమ్మకం కలిగించాలనే ఉద్దేశంతో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఓటర్లలో భయాందోళనకు తావులేకుండా చేయడంలో భాగంగా స్థానిక పోలీసులు, పోలీస్ బలగాలతో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించినట్లు వారు చెప్పారు. సమస్యాత్మక వార్డులపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ఎవరైనా అల్లర్లు సృష్టించాలని చూస్తే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హెచ్చరించారు. ఈ ఎన్నికల్లో ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఫ్లాగ్‌మార్చ్‌లో మున్సిపల్ కమిషనర్ మహేష్, సీఐ సంతోష్ గౌడ్, ఎస్సైలు మహేష్, భార్గవ్, పుష్పరాజ్, సిద్ధికి, పోలీస్, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

## 'కేటీఆర్‌కు పోచారం గురించి మాట్లాడే అర్హత లేదు..'



**అక్షరటుడే, బాన్సువాడ:** అధికారంలో ఉన్నప్పుడు ఫోన్ ట్యాపింగ్ చేసిన కేటీఆర్‌కు ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి గురించి మాట్లాడే అర్హత లేదని ఉమ్మడి జిల్లాల డీసీసీబీ మాజీ ఛైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి అన్నారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో రోడ్‌షోలో మాట్లాడారు. తన చెల్లెలు కవితను కాపాడుకోలేని కేటీఆర్.. సమస్యలు పరిష్కరిస్తామనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. బాన్సువాడ నియోజకవర్గానికి ఎమ్మెల్యే పోచారం రూ.10 వేల కోట్లు తెచ్చి అభివృద్ధి చేశారని భాస్కర్‌రెడ్డి అన్నారు. సిరిసిల్ల మున్సిపాలిటీని అభివృద్ధి చేసే దమ్ము లేని కేటీఆర్‌కు మాట్లాడే అర్హత లేదన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ మద్దతుతో ఎమ్మెల్యే పోచారం నియోజకవర్గ అభివృద్ధికి రూ.727 కోట్లు తీసుకువచ్చారని గుర్తుచేశారు. గత ప్రభుత్వ హయాంలో పెండింగ్‌లో రూ. 50కోట్ల బిల్లులు మంజూరు చేయించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆగ్రో ఇండస్ట్రీస్ ఛైర్మన్ కాసుల బాలరాజ్, గురు వినయ్, నార్ల సురేష్, కృష్ణారెడ్డి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# విలీనం..

# అభివృద్ధికి దూరం..

■ కామారెడ్డి మున్సిపాలిటీలో విలీనమైన గ్రామాలు ■ అభివృద్ధికి దూరమైన ఎస్సీవాడ ■ పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

**ఆ కాలనీ ప్రజలు గ్రామ పంచాయతీ ఉన్నప్పుడు అందరికి చేరువగా ఉండేవారు. మున్సిపాలిటీలో విలీనం అయ్యాకా పరిస్థితి పూర్తిగా తారుమారైంది. సర్పంచ్ ఉన్నప్పుడు తమ కాలనీకి వచ్చి ఏం కావాలని అడిగేవారు. ఇప్పుడు పట్టించుకునే వాళ్లే కరువయ్యారంటున్నారు కాలనీ వాసులు. కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని రెండవ వార్డుకు చెందిన అడ్లూర్ గ్రామ ఎస్సీ వాడ ప్రజల దుస్థితి ఇది. – అక్షరటుడే, కామారెడ్డి**

కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలో ఏడు గ్రామాలు మున్సిపాలిటీలో విలీనమయ్యాయి. అందులో భాగంగా అడ్లూర్ గ్రామం 1వ వార్డులోకి చేరింది. అలాగే ఎస్సీ వాడ, రామేశ్వర్ పల్లి గ్రామం కలిపి రెండో వార్డులోకి చేరాయి. దాంతో అడ్లూర్ ప్రజలు ఏపని కావాలన్నా పక్క గ్రామమైన రామేశ్వర్‌పల్లి కౌన్సిలర్ వద్దకు వెళ్లాల్సి వస్తుందని కాలనీ ప్రజలు చెప్తున్నారు.

### గ్రామం నుంచి దూరంగా..

కామారెడ్డి మున్సిపాలిటీలో అడ్లూర్ గ్రామం విలీనం కాకముందు గ్రామంలో ప్రతిపనిలో ఎస్సీ వాడకు చెందిన ప్రజలు భాగస్వామ్యం అయ్యేవారు. సమస్య ఏది ఉన్నా గ్రామానికి వచ్చి సర్పంచ్‌కు చెప్పుకునేవారు. దాంతో సమస్య క్షణాల్లో పరిష్కారానికి నోచుకునేది. ప్రస్తుతం ఆ కాలనీ ప్రజలు రామేశ్వర్ పల్లి గ్రామంలో కలిసిపోయారు. అసలే గ్రామ కంఠానికి కిలోమీటర్ దూరంలో ఉన్న ఆ ప్రజాలు విలీనం గ్రామానికి పూర్తిగా దూరమయ్యారు.

### కౌన్సిలర్ లేడు.. అభివృద్ధి లేదు..

రెండో వార్డులో మొత్తం 1,600 లకు పైగా ఓటర్లు ఉంటారు. ఇందులో అడ్లూర్‌కు సంబందించి 550 మంది ఓటర్లు ఉంటారు. మెజారిటీ ఓట్లు రామేశ్వర్ పల్లిలో ఉండటంతో ఎస్సీ కాలనీని పట్టించుకునే పరిస్థితి లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలనీకి ప్రత్యేకంగా కౌన్సిలర్ లేదని, పోటీ చేసినా గెలిచే పరిస్థితి లేదు. కాలనీ కూడా దూరంగా ఒంటరిగా ఉండటం అక్కడి ప్రజలకు ఇబ్బందులు తెచ్చిపెడుతోంది.

రోడ్లు, వీధి దీపాలు, మురికి కాలువలు కావాల్సి ఉంటే కౌన్సిలర్‌కు ఫోన్ చేయాలి. కాలనీలో తాగునీటికి సంబంధించి మోటార్ కాలిపోతే నీళ్లు వచ్చే పరిస్థితి లేదని కాలనీ వాసులు వాపోతున్నారు. ఎస్సీ రిజర్వేషన్ వచ్చినా ఈ కాలనీ నుంచి పోటీ చేయాల్సి వచ్చేదని, అది కూడా రాకపోవడంతో ఇతరులపై ఆధారపడి వస్తుందని కాలనీవాసులు వాపోతున్నారు. ప్రస్తుతం మున్సిపల్ ఎన్నికలు జరుగుతున్న సందర్భంలో తమ సమస్యను పాలకులు పట్టించుకుని తగిన న్యాయం చేయాలని కోరుతున్నారు.

### కౌన్సిలర్‌గా అవకాశం ఇవ్వాలి



మున్సిపాలిటీలో విలీనం తర్వాత గ్రామానికి దూరమయ్యాం. ఈసారి ఎస్సీ రిజర్వేషన్ వస్తే పోటీ చేద్దామనుకున్నా.. మా ఆశలు ఆవిరయ్యాయి. మా కాలనీ నుంచి కౌన్సిలర్ అయ్యే అవకాశం ఉంటే కాలనీ అభివృద్ధికి పాటుపడేవాడిని. ప్రస్తుత ఎన్నికల్లో గెలిచే కౌన్సిలర్ అయినా మా కాలనీ అభివృద్ధిపై దృష్టి పెట్టాలి.

– పెరుమాండ్ల బులెట్, కాలనీ వాసి

### మెజారిటీ లేక ఓడిపోతున్నాం



మా కాలనీ కంటే రామేశ్వర్ పల్లి ఓటర్లు ఎక్కువ ఉన్నారు. గత ఎన్నికల్లో కౌన్సిలర్‌గా పోటీ చేస్తే మెజారిటీ లేక ఓడిపోయాను. దాంతో అన్ని విషయాల్లో మేము వెనకబడిపోతున్నాం. గ్రామ పంచాయతీలలో ఉన్నప్పుడే బాగుండేది అనిపిస్తుంది. అధికారులు స్పందించి న్యాయం చేయాలి.

– కుంబాల ఎల్లయ్య, కాలనీ వాసి

## అబాకస్ పోటీల్లో కామారెడ్డి విద్యార్థి ప్రతిభ




**అక్షరటుడే, కామారెడ్డి:** విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీయడానికి ఆయా పాఠశాలలు, విద్యాశాఖ పలు పోటీలు నిర్వహిస్తున్నాయి. ఈ సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలోని ఓ పాఠశాలలో విశ్వం ఎజుటెక్ సంస్థ నిర్వహించిన రాష్ట్రస్థాయి గణిత అబాకస్ పోటీలో కామారెడ్డి విద్యార్థి ఉత్తమ ప్రతిభ కనబర్చాడు. ఈ పోటీల్లో కామారెడ్డి పట్టణంలోని విశ్వభారతి పాఠశాలకు చెందిన పి.రిత్విక్ పాల్గొని ఉత్తమ ప్రతిభతో మూడోస్థానంలో నిలిచాడని పాఠశాల కరస్పాండెంట్ అబ్దుల్ సలాం సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల అబాకస్ ఉపాధ్యాయిని సుమలత, విద్యార్థి రిత్విక్ తల్లిదండ్రులను ఆయన అభినందించారు.



## ముప్కాల్‌లో మౌలిక సదుపాయాలు కల్పిస్తాం

**అక్షరటుడే, ముప్కాల్:** ముప్కాల్ గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని సర్పంచ్ కొమ్ముల సాయమ్మ అన్నారు. ఈ మేరకు ముప్కాల్ మండల కేంద్రంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలు, అభివృద్ధి పనులపై చర్చించారు. గ్రామస్థుల నుంచి వచ్చిన సూచనలు, వినతులను స్వీకరించిన అనంతరం అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మల్లేష్ యాదవ్, ఉప సర్పంచ్ బ్రమ్మదండి చిన్నయ్య, వార్డు సభ్యులు, అంగన్‌వాడీ టీచర్లు, ఐకేపీ సిబ్బంది, ఆశ వర్కర్లు, గ్రామస్థులు పాల్గొన్నారు.



## పోచంపాడ్‌లో అభివృద్ధి పనులకు భూమిపూజ

**అక్షరటుడే మెండోరా:** పోచంపాడ్ గ్రామంలో సోమవారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పోచంపాడ్ అంగడి బజార్ వద్ద పబ్లిక్ టాయిలెట్స్ నిర్మాణానికి, అలాగే నెహ్రూనగర్‌లో నూతన బోరు ఏర్పాటు కోసం సర్పంచ్ మాధురి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ టౌన్ ప్రెసిడెంట్ రాజు, ఎంపీడీవో సుదర్శన్, ఏపీవో అశోక్, పంచాయతీ కార్యదర్శి భోజన్న, గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ హయాంలోనే ఎల్లారెడ్డి అభివృద్ధి



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ఎల్లారెడ్డి గతంలో కాంగ్రెస్ పార్టీ హయాంలోనే అభివృద్ధి చెందిందని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఎమ్మెల్యే మదన్ మోహన్ నాయకత్వంలో పట్టణం మరింతగా అభివృద్ధి చెందుతోందని ఎంపీ సురేశ్ షెట్కార్ తెలిపారు. ఎల్లారెడ్డి క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే మదన్ మోహన్ ఆధ్వర్యంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఎల్లారెడ్డి పట్టణంలో గత బీఆర్ఎస్ పాలనలో తట్టెడు మట్టి కూడా వేయలేదని విమర్శించారు. గతంలో కాంగ్రెస్ పార్టీ పాలనలోనే అభివృద్ధి జరిగిందని.. మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే ఎమ్మెల్యే మదన్ మోహన్ ఎల్లారెడ్డిని దగ్గరుండి అభివృద్ధి చేస్తున్నారన్నారు. గతంతో పోలిస్తే నేడు ఎల్లారెడ్డిలో గణనీయమైన మార్పు కనిపిస్తోందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, మున్సిపాలిటీలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్నాయని ఎంపీ సురేశ్ షెట్కార్ అన్నారు. ఎల్లారెడ్డి మినీట్యాంక్ బండ్, బస్‌స్టాండ్, ఏటీసీ సెంటర్, అమృత్ 2.0, ప్రతి వార్డులో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు తదితర పనులు ప్రతిపక్షాలకు కనిపించట్లేదన్నారు. గత పాలకుల నిర్లక్ష్యంతో వెనుకబడిన ఎల్లారెడ్డిని నేడు అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ఘనత ఈ ప్రభుత్వానిదేనని చెప్పారు. మున్సిపల్ ఎన్నికల్లో అన్ని వార్డుల్లో కాంగ్రెస్ అభ్యర్థులను బంపర్ మెజారిటీతో గెలిపించాల్సిన బాధ్యత ప్రజలపై ఉందని ఎమ్మెల్యే అన్నారు.

## కామారెడ్డిలో మార్పు తేకపోతే మళ్లీ పోటీ చేయను: కేవీఆర్



**అక్షరటుడే, కామారెడ్డి :** మూడేళ్లలో కామారెడ్డిలో మార్పు తేకపోతే తాను మళ్లీ ఎన్నికల్లో పోటీ చేయనని ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి అన్నారు. మార్పు కోసం, బంగారు భవిష్యత్తు కోసం ప్రజలే నిర్ణయం తీసుకోవాలని, మున్సిపాలిటీలో బీజేపీకి పట్టం కట్టాలని కోరారు. ఎన్నికల ప్రచారం చివరిరోజు సందర్భంగా కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని దేవునిపల్లి మల్లన్న ఆలయం నుంచి పట్టణంలోని 49 వార్డుల్లో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. వందలాది బైకులు, 49 మంది కౌన్సిలర్ అభ్యర్థులకు సంబంధించిన ప్రచార వాహనాలతో కామారెడ్డిలో కాషాయ జెండాలు రెపరెపలాడాయి. అనంతరం నిజాం సాగర్ చౌరస్తాలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కామారెడ్డి భవిష్యత్తు పట్టణ ప్రజల చేతిలో ఉందన్నారు. కబ్జాదారులు కావాలా..? అభివృద్ధి కావాలా..? సేవ చేసేవాళ్లు కావాలా..? సెటిల్మెంట్లు చేసేవాళ్లు కావాలా..? ప్రజలే ఆలోచించుకోవాలన్నారు.

### నిజాయితీగా వార్డుల అభివృద్ధికి కృషి..

నిజాయితీగా వార్డుల ను అభివృద్ధి చేసేందుకు బీజేపీ అభ్యర్థులు పోటీ చేస్తున్నారని, మున్సిపాలిటీలో ఛైర్మన్ అయ్యేది బీజేపీ అభ్యర్థేనని ధీమా వ్యక్తం చేశారు. గెలిచిన కౌన్సిలర్లు ఒక్క రూపాయి కూడా ఆశించరని, అవినీతి లేకుండా సేవ చేస్తారని తెలిపారు. అవినీతి రహిత పాలన చేయకపోతే తాను మళ్లీ పోటీ చేయనని స్పష్టం చేశారు. భూ బకాసురులు, దొంగలు, అవినీతి పరులు అంతా ఒకే చోటకు చేరారని, అందరూ కలిసి టీంగా వస్తున్నారని, ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలో ఉంటారన్నారు. రూ. లక్షలు, కోట్లు ఖర్చుచేసి ఎందుకు గెలుస్తున్నారో ప్రజలు ఆలోచించాలన్నారు. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్న వారిని మున్సిపాలిటీ నుంచి తరిమేయాలని పిలుపునిచ్చారు.

## మేకలకు మేత కోసం వెళ్లి..
## కరెంట్‌షాక్‌తో యువకుడి మృతి

**అక్షరటుడే, గాంధారి:** మేకలకు మేత తెచ్చేందుకు చెట్టెక్కి కరెంటు వైర్లకు తగిలి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన గాంధారి మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గాంధారి మండలంలోని వండ్రికల్ గ్రామానికి చెందిన వేముల కిషన్ (25) పోలుమత్తడి వాగు వద్ద మేకలకు మేతకోసం మేడిచెట్టు పైకి ఎక్కాడు. చెట్టుపై కొమ్మలు విరుస్తున్న సమయంలో విద్యుత్‌తీగల తగలడంతో కిషన్ అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు గమనించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. స్పందించిన పోలీసులు వెంటనే సంఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని కిందికి దించారు. అనంతరం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు గాంధారి పోలీస్‌స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ రవికుమార్ తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలు

**అక్షరటుడే, కోటగిరి:** రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయలయ్యాయి. ఈ ఘటన పోతంగల్ మండలం జల్లపల్లి ఆబాది వద్ద ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పోతంగల్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పుప్పాల శంకర్ బాన్సువాడలో ప్రచారం ముగించుకుని మరో వ్యక్తితో బైక్‌పై తిరిగి వస్తుండగా మండలంలోని జల్లపల్లి ఆబాది వద్ద బైక్ అదుపు తప్పింది. దీంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. అనంతరం క్షతగాత్రులను బోధన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని జీజీహెచ్‌కు తరలించారు. ప్రస్తుతం వారిద్దరికి చికిత్స జరుగుతోంది.

## మంజీర నదిలో గొర్రెల కాపరి గల్లంతు

**అక్షరటుడే, బాన్సువాడ:** బీర్కూర్ మండల పరిధిలోని మంజీరా నదిలో సోమవారం విషాదకర ఘటన చోటు చేసుకుంది. గొర్రెల కోసం నది ఒడ్డుకు వెళ్లిన రవి అనే యువకుడు ప్రమాదవశాత్తు నదిలో లోతుగా తవ్విన గోతిలో పడి గల్లంతయ్యాడు. స్థానికుల సమాచారం మేరకు వెంటనే గాలింపు చర్యలు చేపట్టారు. అయితే ఘటనాస్థలంలో నది లోతు ఎక్కువగా ఉండటంతో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. రవి మృతదేహం కోసం పోలీసులు, స్థానికులు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. రవికి భార్య, ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారు. ఈ ఘటనతో గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి.

## షబ్బీర్‌అలీతో కలిసి కాంగ్రెస్ నాయకుల ప్రచారం



**అక్షరటుడే, భిక్కనూరు:** మున్సిపల్ ఎన్నికల్లో సోమవారం కామారెడ్డి పట్టణంలో కాంగ్రెస్ నాయకులు జోరుగా ప్రచారం నిర్వహించారు. ఈ క్రమంలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ కాంగ్రెస్ కౌన్సిలర్ల గెలుపే లక్ష్యంగా ప్రచారం చేశారు. వాడవాడలా కలియ దిరిగారు. ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. ప్రచారంలో మాజీ ఎంపీపీ తొగరి (బైండ్ల )సుదర్శన్, మాజీ సర్పంచ్ బైండ్ల భూపతి, కాంగ్రెస్ పార్టీ నాయకులు తొగరి లింగం, తొగరి శ్రీధర్, శ్యామ్ కుమార్ పాల్గొన్నారు.

# కామారెడ్డి మున్సిపాలిటీ కాంగ్రెస్‌దే..



**అక్షరటుడే, కామారెడ్డి:** కామారెడ్డి మున్సిపాలిటీలో కాంగ్రెస్ విజయం సాధిస్తుందని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. సోమవారం సాయంత్రం ఆయన పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. కామారెడ్డిలో 3235 స్థానాల్లో గెలిచి ఛైర్‌పర్సన్ పీఠాన్ని ఒంటరిగానే కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోబోతుందని అన్నారు. సోమవారం కామారెడ్డిలో అభివృద్ధి కావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. ఐదేళ్లు ప్రతిపక్షం, పదేళ్లు అధికారంలో ఉన్న మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ మున్సిపాలిటీ అభివృద్ధి చేయలేదని విమర్శించారు. బీజేపీ ఎమ్మెల్యేగా రమణారెడ్డి వచ్చాక అభివృద్ధి చేస్తారని ఎంతో ఆశించామని, రెండేళ్లుగా కనబడని ఎమ్మెల్యే ప్రస్తుతం ఎన్నికల్లో వచ్చి మాట్లాడుతున్నారన్నారు. కామారెడ్డిలో వరదలు వస్తే ప్రస్తుత ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే రాలేదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి సీతక్క, ఎమ్మెల్సీల బృందం వరద ప్రాంతాల్లో పర్యటించారని గుర్తు చేశారు.

### రూ.200 కోట్లు మంజూరు

కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలతో ప్రజలకు కాంగ్రెస్ పార్టీపై పూర్తి నమ్మకం ఏర్పడిందని షబ్బీర్ అలీ అన్నారు. సొంత ప్రాంతంలో అభివృద్ధి చేయాలని తాను సీఎంకు రూ.200 కోట్ల ప్రతిపాదనలు పంపితే మంజూరు చేశారని చెప్పారు. రూ.8 కోట్లతో ఇండోర్ స్టేడియం పనులకు శంకుస్థాపన చేశామన్నారు. కామారెడ్డి పట్టణానికి తాగునీటి సమస్య పరిష్కారం కోసం 4 ఎంఎల్‌డీ ఉన్న నీటి సరఫరాను 10 ఎంఎల్‌డీకి మార్చామన్నారు. ఫలితంగా 20 ఏళ్ల వరకు పట్టణంలో నీటి ఇబ్బందులు రాకుండా ఉంటాయన్నారు. సమావేశంలో ఎన్నికల ఇన్‌ఛార్జి, మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ నెరెళ్ల శారద, డీసీసీ మాజీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్ రావు, టీపీసీసీ జనరల్ సెక్రెటరీ ఇంద్రకరణ్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు పండ్ల రాజు తదితరులు పాల్గొన్నారు.



## అండగా ఉంటా.. ఆదరించండి..

**అక్షరటుడే, ఇందూరు :** సేవ చేసేందుకు ఒక్కసారి అవకాశమివ్వాలని 9వ డివిజన్ బీఆర్ఎస్ అభ్యర్థిని డిల్లోడ్ సోని ఆకాష్ రాథోడ్ అన్నారు. సాయినగర్ తదితర కాలనీల్లోని ప్రజలను కలుస్తూ ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. నగరంలో బీఆర్ఎస్ హయాంలో మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా ఆధ్వర్యంలో చెప్పుకోదగ్గ అభివృద్ధి జరిగిందని సోని ఆకాష్ అన్నారు. అదే స్ఫూర్తితో డివిజన్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. డివిజన్‌లో ప్రభుత్వ పథకాల అమలు కోసం కృషి చేస్తామన్నారు. కాలనీల్లో పలుచోట్ల రోడ్లు లేవని, నల్లా నీళ్లు రావట్లేదని ఫిర్యాదులు ఉన్నాయన్నారు. వాటి పరిష్కరిస్తూ ముందుకు వెళ్తామని పేర్కొన్నారు. ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి కష్టసుఖాల్లో పాలుపంచుకుంటామని డిల్లోడ్ సోని ఆకాష్ అన్నారు. డివిజన్‌కు రావాల్సిన నిధులను పోరాడి సాధిస్తామని అభివృద్ధి చేసేందుకు ఒక్కసారి తనకు కార్పొరేటర్‌గా అవకాశం ఇవ్వాలని ఆమె ఓటర్లను కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎల్లారెడ్డి డిస్ట్రిబ్యూషన్ కేంద్రం పరిశీలన



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ఎల్లారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని సోమవారం ఆర్డీవో పార్థ సింహారెడ్డి పరిశీలించారు. తహశీల్దార్ ప్రేమ్ మున్సిపల్ ఏఈ వినోద్‌తో కలిసి కేంద్రంలో ఏర్పాట్లపై సమీక్షించారు. మున్సిపల్ ఎన్నికలు ఈనెల 11న బుధవారం ఉదయం 7 గంటల నుంచి 5 గంటల వరకు జరుగనున్న దృష్ట్యా ఎన్నికల సామగ్రి పంపిణీ విధానాన్ని తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే పట్టణంలోని మిగతా పోలింగ్ బూత్‌లను పరిశీలించారు.

## ‘దండుపాళ్యం బ్యాచ్ నుంచి ఎల్లారెడ్డిని రక్షించుకుందాం’

**అక్షరటుడే, ఎల్లారెడ్డి :** కాంగ్రెస్ దండుపాళ్యం బ్యాచ్ నుంచి ఎల్లారెడ్డిని కాపాడుకునేందుకు బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే నల్లమడుగు సురేందర్ పిలుపునిచ్చారు. పట్టణంలోని బస్టాండ్ వద్ద విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి అంతా బీఆర్ఎస్ హయాంలో జరిగిందేనని నల్లమడుగు సురేందర్ అన్నారు. ఆయా పనులకు సంబంధించి తాను తీసుకొచ్చిన పనులకు సంబంధించిన జీవో పత్రాలను చూపుతూ ఆయన మాట్లాడుతూ ఆనాడు నూతన ఆర్టీసీ బస్టాండ్, సెంట్రల్ లైటింగ్ డివైడర్స్, డబుల్ బెడ్ రూం ఇళ్లు, డయాలసిస్ సెంటర్, సీసీ రోడ్లు నిర్మాణం, పెద్ద చెరువుకట్టపై రెండు వంతెనలు, చిల్డ్రన్స్ పార్క్, ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలికల స్కూల్, నూతన 100 పడకల ఆస్పత్రి పనులన్నీ బీఆర్ఎస్ హయాంలో జరిగినవేనన్నారు. ఆనాడు నేను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఎల్లారెడ్డి మున్సిపాలిటీకి అనేక నిధులు తెచ్చి అభివృద్ధి చేశానన్నారు. అప్పుడు చేసిన పనులకు నేడు ఎమ్మెల్యే మదన్‌మోహన్ ఆయన పేరు పెట్టుకుని ఫొటోలు దిగుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. నేడు కాంగ్రెస్ నాయకులు అప్పట్లో జరిగిన పనులకు ఫొటోలు దిగడం తప్ప కొత్తగా చేసిందేమీ లేదన్నారు. ఎమ్మెల్యే మదన్‌మోహన్‌కు ధైర్యం ఉంటే తాను కొత్తగా తీసుకొచ్చిన జీవోలు చూపించాలని సవాల్ విసిరారు. మున్సిపల్ ఎన్నికల్లో ఓట్ల కోసం



మీ ఇళ్లకు వచ్చే కాంగ్రెస్ నాయకులను.. ‘మీరిచ్చిన హామీలు ఏమయ్యాయి’ అని ప్రశ్నించాలని మాజీ ఎమ్మెల్యే అన్నారు. ఎల్లారెడ్డిలో మున్సిపాలిటీలో కాంగ్రెస్ అభ్యర్థులు గెలిచేందుకు ఎంతయినా ఖర్చు చేసి గెలవాలని అధిష్టానం చెబుతోందని.. గెలుపు కోసం కాగ్రెస్ నాయకులు ఎంతకైనా దిగజారుతారన్నారు. వ్యాపారులకు యువకులకు, ఉద్యోగులకు ఎమ్మెల్యే బెదిరింపు కాల్స్ చేస్తున్నారని ఆరోపించారు. వారందరికి ఓటుతోనే గుణపాఠం చెప్పాలని సూచించారు. బీఆర్ఎస్ కౌన్సిలర్ అభ్యర్థులను గెలిపించుకుంటేనే ఎల్లారెడ్డిని కాపాడుకోగలమని ఆయన స్పష్టం చేశారు. సమావేశంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## 19వ డివిజన్ అభివృద్ధి బాధ్యత నాదే..



**అక్షరటుడే, ఇందూరు :** తనను గెలిపిస్తే 19వ డివిజన్ అభివృద్ధి బాధ్యత తీసుకుంటానని బీజేపీ కార్పొరేటర్ అభ్యర్థి నాగోళ్ల లక్ష్మీనారాయణ అన్నారు. ఈ మేరకు కంఠేశ్వర్, తదితర కాలనీల్లో తిరుగుతూ ఓట్లు అభ్యర్థించారు. ఒకసారి తనకు కార్పొరేటర్‌గా అవకాశం ఇస్తే ఆయా కాలనీల్లో సమూలమైన మార్పులు తీసుకొస్తానని నాగోళ్ల లక్ష్మీనారాయణ అన్నారు. ముఖ్యంగా మౌలిక సదుపాయాలు లేక చాలా కాలనీల్లో ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. వాటిని తప్పనిసరిగా పరిష్కరిస్తామని ఆయన ప్రజలకు హామీ ఇచ్చారు. కాలనీల్లో ప్రతి ఒక్కరితో మాట్లాడుతూ ఆయన ముందుకు కదిలారు. నిజామాబాద్ అర్బన్‌లో ‘మన ఇందూరు-మన మేయర్’ నినాదంతో ముందుకు వెళ్తున్నామని.. ప్రతిఒక్కరూ బీజేపీకి ఓటు వేస్తే బీజేపీకే మేయర్ పీఠం దక్కుతుందని నాగోళ్ల వివరించారు. ఎంపీ అర్వింద్, ఎమ్మెల్యే ధన్‌పాల్ సహకారంతో డివిజన్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని ఆయన ప్రజలకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అభివృద్ధి చేస్తాం.. ఆదరించి గెలిపించండి..



**అక్షరటుడే, ఇందూరు :** నగరంలోని 24వ డివిజన్ కార్పొరేటర్‌గా తనను గెలిపించాలని ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని బీఆర్ఎస్ కార్పొరేటర్ అభ్యర్థిని భవాని బింగి రాకేష్ అన్నారు. నగరంలోని డివిజన్ పరిధిలోని కాలనీల్లో సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. తానెప్పుడూ ప్రజల మనిషినేనని ఎల్లవేళలా వారికి అండగా ఉంటానని భవాని అన్నారు. ఈ సందర్భంగా కాలనీలో ప్రతి ఇంటికి వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. డివిజన్ పరిధిలోని ఆయా కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పననే ధ్యేయంగా ముందుకు వెళ్తామన్నారు. ఒక్కసారి తనకు అవకాశమిస్తే ఐదేళ్లు ప్రజాసేవ చేస్తానని ఆమె హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ హయాంలో నగరంలో చెప్పుకోదగ్గ అభివృద్ధి జరిగిందని భవాని బింగి రాకేస్ ఓటర్లకు గుర్తు చేశారు. మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా ఆధ్వర్యంలో కేసీఆర్‌తో మాట్లాడి రూ. కోట్లలో నిధులు తెచ్చారన్నారు. డివిజన్‌కు రావాల్సిన నిధులను పక్కాగా తీసుకువచ్చి ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాలను కల్పిస్తానని ఆమె స్పష్టం చేశారు. కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం : ఎమ్మెల్యే ధన్‌పాల్



**అక్షరటుడే, ఇందూరు :** బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. నగరంలోని 8వ డివిజన్‌లో బీజేపీ అభ్యర్థికి మద్దతుగా ధన్‌పాల్ సూర్యానారాయణ గుప్తా సోమవారం ప్రచారం చేశారు. పలు కాలనీల్లో ఇంటింటికీ తిరుగుతూ ఓటర్లను కలిశారు. బీజేపీతోనే నగర అభివృద్ధి సాధ్యమన్నారు. నిజామాబాద్ కార్పొరేషన్ పీఠాన్ని కైవసం చేసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. 8వ డివిజన్‌లో నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే మఠం పవన్‌ను గెలిపించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఎమ్మెల్యే వివరించారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అవినీతికి తావు లేకుండా అన్ని రంగాల్లో దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తోందన్నారు. 8వ డివిజన్ అభ్యర్థి మఠం పవన్ మాట్లాడుతూ.. తనను ఆశీర్వదించి ఓటు వేయాలని కోరారు. డివిజన్ పరిధిలోని కాలనీల్లో సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

## ఆదరించి గెలిపించండి..



**అక్షరటుడే, ఇందూరు :** నగరంలోని 39వ డివిజన్ అభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తానని.. ఆదరించి గెలిపించాలని బీజేపీ కార్పొరేటర్ అభ్యర్థిని దాంపల్లి జ్యోతి మురళికృష్ణ అన్నారు. ఈ మేరకు ఆయా కాలనీల్లో ప్రచారం నిర్వహించారు. డివిజన్‌లో తనకు మద్దతిచ్చి గెలిపిస్తే ప్రతి కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని జ్యోతి మురళికృష్ణ అన్నారు. ఈ మేరకు ప్రజలతో మమేకమై ముందుకు కదిలారు. తనను నమ్మి గెలిపించాలని.. ఆ నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఐదేళ్లు ప్రజల మధ్యే ఉంటామని ఆమె హామీ ఇచ్చారు. డివిజన్ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తామని ఈ సందర్భంగా పేర్కొన్నారు. బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని ఎంపీ , ఎమ్మెల్యే సహకారంతో డివిజన్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతామని దాంపల్లి జ్యోతి మురళికృష్ణ ప్రజలకు హామీ ఇచ్చారు. తనను మీ ఇంటి ఆడబిడ్డగా భావించి ఓటువేసి గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 16వ డివిజన్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ :** తనను గెలిపిస్తే అభివృద్ధి చేసి చూపిస్తానని 16వ డివిజన్ బీజేపీ కార్పొరేటర్ అభ్యర్థిని అనిత సురేష్ అన్నారు. ఈ సందర్భంగా డివిజన్‌లోని దుబ్బలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా అభ్యర్థిని అనిత సురేష్ కాలనీల్లో కలియదిరుగుతూ ప్రతిఒక్కరిని కలిశారు. బీజేపీకి ఓటువేసి గెలిపించాలని విన్నవించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ డివిజన్‌లో ప్రతి ఒక్క సమస్యపై తనకు పూర్తి అవగాహన ఉందన్నారు. అవకాశం ఇస్తే వాటిని పరిష్కరించి ముందుకు వెళ్తానని ఆమె అన్నారు. ఎంపీ అర్వింద్, ఎమ్మెల్యే ధన్‌పాల్ సహకారంతో డివిజన్‌కు భారీగా నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేస్తానన్నారు. ‘మన ఇందూరు–మన మేయర్’ నినాదంతో ముందుకు వెళ్తామని.. ప్రతిఒక్కరూ తమకు మద్దతు తెలిపాలని వారు కోరారు. ఎక్కువ మంది బీజేపీ కార్పొరేటర్లను గెలిపించుకుని మేయర్ పీఠాన్ని కొవసం చేసుకుందామని ఆమె అన్నారు. కార్యక్రమంలో పలువురు బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఓటేసి గెలిపించండి.. అభివృద్ధి బాధ్యత నాదే..



**అక్షరటుడే, ఇందూరు :** తనను ఓటేసి గెలిపించండి.. అభివృద్ధి బాధ్యత నాదేనని 47వ డివిజన్ బీజేపీ అభ్యర్థి దుద్దోళ్ల గిరిబాబు అన్నారు. ఈ మేరకు కాలనీల్లో విస్తృతంగా పర్యటించి ప్రజలను ఓట్లు అభ్యర్థించారు. ఎల్లప్పుడూ ప్రజల మధ్య ఉండి వారి కష్టసుఖాల్లో పాలుపంచుకుంటానని గిరిబాబు అన్నారు. డివిజన్‌కు సంబంధించిన ప్రతి సమస్యపై తనకు అవగాహన ఉందని, వాటి పరిష్కారంలో ప్రజల సహకారంతో ముందుకు వెళ్తానని పేర్కొన్నారు. ముఖ్యంగా డ్రెయినేజీ, తాగునీటి సమస్యలు, శివారు కాలనీలో రోడ్ల సమస్య ఉందని ఈ సమస్యల పరిష్కారానికి ప్రణాళికతో ముందుకు వెళ్తానని చెప్పారు. నిజామాబాద్ అర్బన్‌లో ఎంపీ అర్వింద్, ఎమ్మెల్యే ధన్‌పాల్ సహకారంతో డివిజన్‌ను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు కృషిచేస్తానన్నారు. ప్రజా పథకాల అమలులో నిర్లక్ష్యం చేయకుండా ముందుకు వెళ్తానన్నారు. కార్యక్రమంలో పలువురు బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి




**అక్షరటుడే, బాల్కొండ:** నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 12న నిర్వహించనున్న దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని టీయూసీఐ రాష్ట్ర కార్యదర్శి ముత్తెన్న పిలుపునిచ్చారు. ఈ మేరకు మండల కేంద్రంలోని బుస్సాపూర్ ఎక్స్ రోడ్డులో లంగర్ బీడీ కంపెనీలో సమ్మెకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేస్తూ బీజేపీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చిందన్నారు. ఈ కొత్త చట్టాలు కార్మికులకు నష్టపరిచే విధంగా ఉన్నాయని.. వీటిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. చట్టాల కారణంగా ప్రస్తుతం కార్మికులు అదనంగా పొందే వేతనాల్లో భారీ కోతలు తప్పవని హెచ్చరించారు. కార్మికులకు 8 గంటల పనిదినాన్ని 12 గంటల వరకు చేస్తూ చట్టం సవరణ చేయడం జరిగిందని ఇది కార్మికులపై ప్రభావం చూపుతుందన్నారు. కార్యక్రమంలో టీయూసీఐ ఏరియా నాయకులు ఎండీ నజీర్, నిమ్మల నిఖిల్, లలిత, లావణ్య, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



## ఆర్మూర్‌లో బీజేపీ బైక్‌ర్యాలీ

**అక్షరటుడే, ఆర్మూర్:** మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా చివరిరోజు సోమవారం ఆర్మూర్ పట్టణంలో బీజేపీ ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ బైక్ ర్యాలీకి ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై స్వయంగా బైక్ నడుపుతూ బీజేపీ కార్యకర్తలను ఉత్తేజపర్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.